క్లుప్తంగా

ఘనంగా జ్యోతుల మహోత్సవం



జ్యోతులు మోస్తూ నాట్యం చేస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో చౌడేశ్వరీ దేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు.కాలనీకి చెందిన చిన్న, పెద్దగుంపు నేత కార్మికులు జ్యోతులను నెత్తిన పెట్టుకుని అమ్మవారి భక్తిగీతాలను ఆలపిస్తూ నాట్యం చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా చాగంటి చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బందితో కలసి ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బైక్‌ర్యాలీ విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

గుంతకల్లుటౌన్: వీర హనుమాన్ జయంతి సందర్భంగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ ప్రాంత సేవా ప్రముఖ్ డాక్టర్ రామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు మాణిక్‌చంద్ కార్వా, భజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్ రవి కోరారు. మంగళవారం వాసవీ మాత ఆలయంలో బైక్‌ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. 12వ తేదీ ఉదయం 9 గంటలకు బీరప్పగుడి సర్కిల్ నుంచి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం వరకూ నిర్వహించే ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపాజగదీష్, వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి రఘురామ్, జనసేన మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గుత్తి: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన, సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, మండల అధ్యక్షురాలు నిర్మల మాట్లాడారు. ఎన్నికల ప్రచారం సమయంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా ఇంత వరకు కార్మికుల సమస్యలను పరిష్కారం చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో సమస్యలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ

శింగనమల: వచ్చే విద్యాసంవత్సరం అడ్మిషన్లు జరిగే లోపు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల విద్యాశాఖాధికారులతో జీఓ 117 రద్దు, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న విద్యా కాలెండర్‌పై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి ట్యాంకులు, పైపు లైన్లు, విద్యుత్ పరికరాల మరమ్మత్తులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

మామిడి తోటకు నిప్పు

గుత్తి: మండలంలోని బాచుపల్లిలో రైతు జమ్మన్నకు చెందిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించి సుమారు 30 మామిడి చెట్లు కాలిపోయాయి. పూతకు వచ్చిన దశలో మామిడి చెట్లు కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దారులన్నీ రామగిరి వైపు..



గుంతకల్లు నుంచి పాపిరెడ్డిపల్లికి బయలుదేరిన నైరుతిరెడ్డి, పార్టీశ్రేణులు



గుత్తి నుంచి జగన్ పర్యటనకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నినాదాలు చేస్తున్న ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులునాయక్, నాయకులు

- మాజీ సీఎం జగన్‌కు వెల్లువెత్తిన సంఘీభావం
- పోలీసులు అడ్డుకున్నా.. బెదరని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు, అభిమానులు

గుంతకల్లుటౌన్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్య కుటుంబానికి పరామర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ ఆదేశాల మేరకు నైరుతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణం, మండలానికి చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ కాన్వాయ్‌లో పాపిరెడ్డిపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా జై జగన్ అంటూ నినాదాలు చేశారు.

గుత్తి: కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించడానికి మంగళవారం పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా గుత్తి , గుత్తి మండలం నుంచి పార్టీ శ్రేణులు పాపిరెడ్డిపల్లికి భారీగా తరలివెళ్లారు. పట్టణ, మండల కన్వీనర్లు, మాజీ కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, పీరా, గోవర్ధన్ రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు వైపీ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ, వరద, కేవీ రమణ, ఖాజా ఖాన్, షఫి తదితర వందలాది మంది వాహనాల్లో వెళ్లారు.

శింగనమల: సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కురబ లింగమయ్యను టీడీపీ గుండాలు దాడి చేసి హత్య చేయడంతో , ఆ కుటంబాన్ని పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తుండడంతో , నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. శింగనమల మండలానికి చెందిన జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, ఆయన అనుచరులు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వెళ్లుతుండగా పోలీసులు మార్గమధ్యలోనే నిలిపివేశారు. వారు అక్కడి నుంచి నడుచుకుంటూ పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు.

పామిడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంటే జనం అని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలోని పాపిరెడ్డిపల్లికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో జనసంద్రమైందన్నారు. వైఎస్ జగన్ హయాంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అందించడంతోనే జనం స్వచ్ఛందంగా కదలిలా కదలి వచ్చారన్నారు. జగన్ అంటే గిట్టని కొందరు డబ్బు పెట్టి జనాన్ని తరలించారని సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబుపై ప్రజల నుంచి ఆగ్రహావేశాలు అధికమవ్వడం ఆయన అసమర్థత పాలనకు అద్దం పడుతోందన్నారు.

సాగు, తాగునీరు ఇవ్వండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి పిల్లకాలవలు ఏర్పాటు చేసి గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులకు సాగునీరు, తాగునీరు ఇవ్వాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడికి పట్టణంలోని సీపీఐ. సీపీఎం నాయకులు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. మంగళవారం పట్టణంలోని కోనగి గెస్ట్ హౌస్‌లో మంత్రిని వారు కలిశారు. సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, రాముడాయల్, గోపీనాథ్, సీపీఎం నాయకులు బీ.శ్రీనివాసులు, మారుతి ప్రసాద్, విరుపాక్షి తదితరులు మాట్లాడుతూ పిల్లకాలవలు ఏర్పాటు పనులకు 2014లో అడ్మినిస్ట్రేషన్ అనుమతులు లభించగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టెండర్లుకు పిలిచిన విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే భూసేకరణ విషయంలో పెండింగ్ పడి పనులు జరగలేదన్నారు. కర్నూలు జిల్లా మద్దికెర మండలం బొమ్మనపల్లి వద్ద, గుంతకల్లు మండల కసాపురం వద్ద హంద్రీనీవా కాలవకు తూముల ఏర్పాటు చేసి పిల్ల కాలవలు ఏర్పాటు చేస్తే గుంతకల్లు మండలంలోని ములకలపెంట, ములకలపెంటతాండా, గుండాల, గుండాలతాండా, అమీన్‌పల్లి, నరసాపురం, పాతకొత్తచెరువు తదితరల గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. హంద్రీనీవా కాలువకు 10వేల క్యూసెక్కుల నీరు పారేలా కాలవ వెడల్పు చేయాలన్నారు. గుంతకల్లు జీబీసీ కెనాల్‌లో ముళ్లపొదలను, చెత్తచెదారం, పూడికలను తొలగించడంతోపాటు మురికి నీరు కాకుండా మంచినీరు పారేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి



పీఎం సూర్య ఘర్ పథకం పోస్టరర్లు విడుదల చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్, సభ్యులు

పామిడి: అభివృద్ధిపై దృష్టి సారించాలని అధికారులు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండలమీట్ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి హాజరైయ్యారు. ఈసందర్భంగా ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యారంగ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. రామగిరి యూపీ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే రామగిరి ఎగువతండాలో డ్రైనేజీ, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా దిబ్బసానిపల్లిలో అంగన్‌వాడీ స్కూల్‌ను ఏర్పాటును వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఆరోగ్యం, విద్యుత్ తదితర అంశాలపై సంబంధితాధికారులు వివరించారు. అనంతరం పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా చేకూరే ఉచిత విద్యుత్ సౌకర్యంపై అవగాహన కార్యక్రమంతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ మధుసూదన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం, విరుపాపురం, తెలికి, కాశేపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు, ఎంపీటీసీలు ట్రాన్స్‌కో అధికారులపై ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవస్తే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామనన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకరావాలన్నారు. సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఏఓ మల్లీశ్వరి తెలిపారు. ఈనెల 24 నుంచి విద్యార్థులకు వేసవి సెలవులు ప్రారంభమవుతాయని ఎంఈఓ రాముడు తెలిపారు. మండలంలోని దిమ్మగుడి గ్రామంలో రీ సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి, పంచాయితీరాజ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏపీఎం ఖలీల్, హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, డాక్టర్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ బిల్లును రద్దు చేయాలి

- డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

గుంతకల్లు: ప్లారమెంట్ ప్రవేశపెట్టిన పెన్షన్ బిల్లును రద్దు చేసి 8వ పే కమిషన్ వర్తింపజేయాలంటూ ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ఫెడరేషన్ కార్యాలయం నుంచి డీఆర్‌ఎం కార్యాలయం వరకు డివిజన్ వ్యాప్తంగా కదలివచ్చిన పెన్షర్ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ.. 2026, జనవరి 1న ఉద్యోగ విరమణ పొందే వారితో పాటు ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందిన 69 లక్షల మందికి 8వ పే కమిషన్‌ను డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెన్షన్ రద్దు పరిచే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునర్దుంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఎం సీఎస్ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ జయంత్‌కుమార్, కోశాధికారి జి.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా ఆశా డే

యాడికి: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి కాలం రాబోతుందని, గ్రామాల్లోని ఆశా కార్య కర్తలు తప్పకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పూతలు తీయాలని, ఆర్‌డీటీ కిట్ల ద్వారా రక్త పరీక్ష నిర్వహించాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తల కోసం యూనిఫాం (రెండు చీరలు) డాక్టర్ పరమేశ్వర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుభేదా, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పామిడి: మండలంలోని నీలూరు-తంబళ్లపల్లి గ్రామాల నడుమ పాత గంగమ్మ గుడి వద్ద నిల్వ ఉంచిన 66 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తంబళ్లపల్లి పొలాల్లోని పాత గంగమ్మ గుడి వద్ద పీడీఎస్ రైస్ డంప్ అన్న సాక్షి కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో సీఎస్‌డీటీ కంబక్క సారథ్యంలో సివిల్ సప్లయ్ అధికారులు బియ్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పీడీఎస్ రైస్‌ను గుంతకల్ స్టాక్ పాయింట్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేశారు. నిందితుడు గుత్తి మండలం కరిడికొండ గ్రామానికి చెందిన సిద్దపు కదిరి నరసింహను పోలీస్‌కస్టడీకి అప్పగించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకే సారి సిలిండర్‌పై రూ. 50 పెంచడంతో సామాన్య ప్రజలపై పెనుభారం పడిందన్నారు. పెంచిన ధరలు తగ్గించకపోతే భవిష్యత్తులో గ్యాస్ వినియోగదారులతో కలసి వామ పక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు నాయకులు నీలకంఠ, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సహకార సంఘం సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ పుణ్యవతి చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ముస్తాఫా, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

శింగనమల: పిల్లలకు పోషకాహారం అందించేలా తల్లులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని సీడీపీఓ ఉమాశంకరమ్మ సూచించారు. మంగళవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా పోషకాహార ప్రాముఖ్యత, తల్లిపాలు, ముర్రుపాలు, రక్త హీనత, వ్యాధి నిరోధక టీకాల గురించి అవగాహన కల్పించారు. గర్భిణులకు బరువులు తీయడం, రెండు సంవత్సరాలల్లోపు ఉన్న పిల్లలకు బరువులు , ఎత్తులు తీయడం, వారి పెరుగుదల గురించి వివరించారు. అనంతరం సీడీపీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం

గుంతకల్లుటౌన్: ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలల్లోకి తీసుకెళ్లి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు శ్రేణులంతా శ్రమించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఇల్లూరు లక్ష్మీనారాయణ భవన్‌లో బీజేపీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు పార్టీశ్రేణులు సమాయత్తం కావాలని వారు దిశా నిర్దేశం చేశారు. పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, పట్టణ అధ్యక్షులు వడ్డేరమేష్, రవిబాబు, నాయకులు హరిహరనాథ్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై శ్రీరంగనాథుడు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి

తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3 వ రోజు మంగళవారం దేవేరులతో కలసి శేషవాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత శేషతల్ప రంగనాథస్వామి మూలవిరాట్‌కు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. రాత్రి శేషవాహన సేవలను వైభవంగా నిర్వహించారు.

విశ్వామిత్ర అలంకరణలో శ్రీరాముడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశ్వామిత్ర అలంకరణలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి వారికి అర్చకులు విశ్వామిత్ర అలంకరణ చేశారు. మూల విరాట్‌కు అర్చకులు అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. ఆలయా ఆవరణలో హోమం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నైపుణ్యాలతో కూడిన విద్య అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్య అవసరమని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం వారు బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించే ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ ఐక్యూఏసీ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ ఎంఎల్ రవిచంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు, శివ, లింగమయ్య పాల్గొన్నారు.

'గీత పిలుస్తోంది' సినిమా ఆడియో పోస్టర్ల ఆవిష్కరణ

గుత్తి: పట్టణంలోని బసవేశ్వరాలయంలో మంగళవారం వెంకటేశ్వర క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఐదు భాషల్లో రూపొందుతున్న గీత పిలుస్తోంది సినిమా ఆడియో పోస్టర్లను ఆవిష్కరించారు. డైరెక్టర్ దినేష్ తేజ, హీరోయిన్ చౌదరి శ్రావణి, షార్ట్ ఫిల్మ్స్ హీరో కమ్ డైరెక్టరర్లు విజయ భాస్కర్, శివ సమక్షంలో ముఖ్య అతిథులు మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతలు కోనా మురళీ ధర్ రెడ్డి, కోనా ప్రదీప్ రెడ్డి, టౌన్ బ్యాంకు డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాము, న్యాయవాది గంగాధర్ కుమార్, విజయ్, సామాజిక కార్యకర్త సుధాకర్ నాయుడు, దస్తగిరి ఆడియో పోస్టర్లను విడుదల చేశారు.

'కుట్టు శిక్షణ' సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుట్టు శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. మంగళవారం స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయ ప్రాంగణంలో ఐఓసీ, న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నక్కనదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల మహిళలకు స్వయం ఉపాధిని కల్పించే క్రమంలో భాగంగా ఐఓసీ వారు కుట్టు శిక్షణ తరగతులను ఆయా గ్రామాల్లోనే నిర్వహిస్తారన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం మహిళలకు సర్టిఫికెట్‌తోపాటు, రూ.10 వేల నగదు, కుట్టుమిషన్ అందజేస్తారన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

తాడిపత్రి రూరల్: ఐసీడీఎస్‌లో కొందరు సూపర్‌వైజర్లు ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలపై మంగళవారం సీడీపీఓ సాజిదాబేగం విచారణ చేపట్టారు. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, తాడిపత్రి పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లను కలసి విచారణ జరిపారు. విచారణకు అంగన్‌వాడీ యూనియన్ తాడిపత్రి శాఖ అధ్యక్షురాలు గోవిందమ్మ కూడా హాజరయ్యారు. విచారణ సందర్భంగా సూపర్‌వైజర్లపై వస్తున్న అవినీతి ఆరోపణల్లో ఎంత వరకు నిజం ఉందంటూ అంగన్‌వాడీ టీచర్లను అడగడంతో సూపర్‌వైజర్ల ఎదురుగా చెప్పడానికి పలువురు వెనుకంజ వేశారు. ఆ సమయంలో పలు అంశాలను సీడీపీఓ దృష్టికి గోవిందమ్మ తీసుకెళ్లారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్ల మధ్య నెలకొన్న అంతరాయం కారణంగా పలువురు సూపర్‌వైజర్లపై వివిధ రకాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వారిని అంతర్గ బదిలీలు చేస్తామని సీడీపీఓ భరోసానిచ్చారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జయరామ్‌ను యూటీఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందని ఎమ్మెల్యేకు వివరించారు. 31 నుంచి 59 మంది విద్యార్థులున్న యూపీ స్కూల్‌ను సమీపంలో హైస్కూల్ లేకపోతే యూపీ స్కూల్‌గానే కొనసాగిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ప్రభుత్వం యూపీ పాఠశాలలను రద్దుచేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. యూటీఎఫ్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రాజకుమార్, కల్పన, గిరిబాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో మంగళవారం రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని హరిజనవాడకు చెందిన నిర్వాహకులు రామచంద్ర, పరమేశ్ ఆధ్వర్యంలో రాతిదూలం పోటీలను నిర్వహించారు. పోటీల్లో వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం మొరాయిపల్లి తేజస్వినిరెడ్డికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.30 వేలను కైవసం చేసుకున్నాయి. రెండో బహుమతిని పెద్దపేటకు చెందిన చెన్నారెడ్డి వృషభాలు రూ.25 వేలు, మూడో బహుమతి రూ.20వేలను వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన రామ ఓబుళరెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి., నాలుగో బహుమతి రూ.15వేలును యల్లనూరు మండలం నిట్లూరుకు చెందిన రాముడు వృషభాలు, ఐదో బహుమతి రూ.10 వేలను వైఎస్సార్ జిల్లా లింగాల మండలం చిన్న కుడాలకు చెందిన మహేశ్వరరెడ్డి వృషభాలు గెలుపొందాయి. పోటీలకు 18 జతల వృషభాలు హాజరయ్యాయి. పట్టణంతోపాటు పరిసర మండలాల్లోని గ్రామాలకు చెందిన పాల్గొన్నారు.